# ★ సేవకా వృత్తి ★

కొడవటిగంటి కుటుంబరావు

మన తెలుగువాడు బొంబాయి వచ్చాడు, పొట్ట చేతపట్టుకుని. పొట్టకి తెలుగు దేశంలో జాగా లేదు. బొంబాయిలో ఉందని విన్నాడు. రైలు ఖర్చులు అరువు పుచ్చుకొని చక్కా వచ్చాడు.

అవును. బొంబాయిలో ఖాళీలున్నై. అవేం పెద్ద నౌకరీలు కావు. యాభై, అరవై రూపాయల రాబడిగలవి.

"ఈ ఖాళీలిక్కడెందుకున్నై? మనిషి కరువా? ప్రభుత్వం అశ్రద్ధా? ఏమిటీ వింత?" అని మన తెలుగువాడికి సందేహం కలిగింది.

"ఈ ఉద్యోగాలు చేసేవాళ్లు అట్టే కాలం ఉండరు. ఇంతకన్న మంచి ఉద్యోగం కోసం చూస్తూ ఉండి, దొరకగానే పోతారు. అట్లా పోకుండా మొండికెత్తి కాలం గడిపి ఇంతలోనే అంటె పెట్టుకు కూచున్నారా, చచ్చేపోతారు" అన్నాను.

"ఉద్యోగం వల్లనే?" అన్నాడు మన తెలుగువాడు అమాయకంగా.

"నీకు తెలీదా ఏమిటి? ఈ ఊళ్లో ప్రతి ఉద్యోగానికీ దాని 'ఫేటాలిటీ' ఉంది," అన్నాను.

మన తెలుగువాడు నమ్మలేదు.

"అదేమిటండీ? జీతం ఎక్కువ తక్కువ అని బట్టి ఉద్యోగం చేసేవాళ్లకి తెగుళ్లొస్తా యంటారా?" అన్నాడు.

"అదీ ఉంది. కాని అది ప్రతి పిల్లవాడికీ తెలిసిన విషయమే. మరి తక్కువ జీతం తెచ్చుకుంటుంటే కమ్యూనిస్టుల్లో చేరిపోతావు. బోటాబొటీగా అవసరాలకి సరిపడా ఆర్జిస్తుంటే రాజకీయాల మీద విముఖత్వం చూపిస్తావు. దాన్ని మించి ఎంత సంపాదించినా కమ్యూనిస్టుల్ని బూతులు తిడుతూ పత్రికా సంపాదకులకి లేఖలు రాస్తావు. నే నచ్చగా ఆ విషయం చెప్పటంలేదు. నేను చెప్పేది ఇంకా సూక్ష్మమైన విషయం.

"ఇది మనం నౌకరీచేసే కంపెనీలకు సంబంధించినది. ఆ కంపెనీల వాతావరణ ప్రభావమూ, ఆ కంపెనీ డైరక్టర్ల ప్రభావమూ, ఆ కంపెనీలకి ప్రభుత్వంతో గల పలుకుబడి ప్రభావమూ మొదలైనవంతా నీమీద పనిచేస్తుంది."

"ఇప్పుడు తాతా కంపెనీలు బోలెడున్నాయా? అందులో ఖాళీలున్నాయా?—"

"నిజంగానాండీ? ఎక్కడ? చెప్పండి, చెప్పండి," అన్నాడు మన తెలుగువాడు.

వాడి మొహం ఎర్రబడింది. కళ్లు మెరిసాయి. ధర్మామీటరు తీసి రక్తం వేడి చూసి 99 డిగ్రీలుందని గ్రహించాను. నాడి నూట పందొమ్మిది ఉంది.

"అవేం పెద్ద జీతాలు కావు, బాబూ!" అన్నాను.

"తాతా కంపెనీయే అయితే ఏ జీతమయితే మటుకేమండీ?" అన్నాడు మన తెలుగువాడు.

"అదీమాట ... కొన్ని కంపెనీలలో పనిచేసేవాడికి స్వార్థజ్ఞానం ఉండా

లేకుండా పోతుంది. మరి కొన్ని కంపెనీల్లో పనిచేసేవాడికి తిండిమీదా, గుడ్డమీదా కూడా వాంఛ ఉండదు. వైరాగ్యం వచ్చేస్తుంది. భార్యా బిడ్డల ఎడకూడా విముఖత్వం వచ్చేస్తుంది. చాలా ఉద్యోగాల్లో ఆత్మగౌరవంమీద దెబ్బ హరించుకు పోతుంది. బుర్రా తెలివితేటలూ, నైతిక బుద్ధికూడా మొద్దుబారిపోయి, జీవితం అసహ్యంగా తప్పులతో చెయ్యటమూ, అందుకు సిగ్గుపడలేక పోవటమూ జరుగుతుంది.

"ఈ ఊళ్లో ఇంకా కొన్ని కంపెనీలున్నాయి. వాటిలో చేరితే జీవశక్తే యిగిరిపోతుంది. దేశాన్ని, ప్రజల్ని చంపెయ్యాలన్న ఆకాంక్ష పుట్టుకొస్తుంది. ఇది చాలా తీవ్రమైన జబ్బు. కాని ఇటువంటి రోగాలు తెచ్చిపెట్టే కంపెనీల కిక్కడ కొదవా, పలుకుబడీ జాస్తి," అన్నాను.

'మీకు చాలా అనుభవం ఉన్నట్టుందే?' అన్నాడు మన తెలుగువాడు

"నాది వస్తుతహా చాలా మంచితత్వం. అయితే ఏం? నన్నుకూడా ఈ రోగాలు లొంగదీయటానికి ప్రయత్నించాయి.

"ఒక కంపెనీలో పనిచేశా. అందులో పార్సీవాళ్లు ప్రభువులు. సాధ్యమైనంత వరకూ మంచి జీతాలున్న పనులన్నీ వాళ్లు పుచ్చుకుని" పని జాస్తిగావుండేవి మనకు పారేస్తూంటారు.

"ఆ ఉద్యోగంలో చేరగానే అక్కడ ఉన్న తెలుగు సోదరులతో నాకు పరిచయం అయింది. అందులో ఒక వ్యాధిగ్రస్తుడు-చాలా యాక్యూట్ కేసు-కనిపించాడు. అతను నాకు సలహా ఇచ్చాడు. నేను ఆ కంపెనీలో పైకి రావాలంటే ఏం చెయ్యాలో చెప్పాడు. పార్సీవాళ్ళను మస్కాపాలిష్ లగాయించమన్నాడు—"

"అంటే?"

"నువు బొంబాయికి కొత్త. మద్రాసులో తైరు కొట్టటమంటే ఏమిటో, బొంబాయిలో మస్కాపాలిష్ లగాయించటమన్నా అదే... అయిందా? నన్ను నాటి తెలుగువాళ్ళతో అసలు మాట్లాడే వద్దన్నాడు. గతిలేక మాట్లాడవలసివస్తే ఇంగ్లీషులో మాట్లాడమన్నాడు. (ఆపార్సీ వాళ్లు తమలో తాము గుజరాతీ మాట్లాడుతుంటారు.) అదికాక నన్ను సిగరెట్లు కాల్చటం మానెయ్యమన్నాడు. అగ్నిఆరాధించే పార్సీలు సిగరెట్లు సహించరు."

మన ఆంధ్రుడికి కోపం వచ్చింది.

"అదేమిటండీ? మనం తెలుగువాళ్ళమని సిగ్గుపడీ, తెలుగుభాషను చూసి సిగ్గుపడీ, సిగరెట్లు పార్సీవాళ్ళకి అమ్ముడుపోయా - ఆ దిక్కుమాలిన ఉద్యోగం చెయ్యకపోతే ఏ రైలు కిందన్నాపడి చావొచ్చుగా?" అన్నాడతను.

"నాకూ అట్లాగే అనిపించింది. అయితే ఏం? అతనిప్పుడు మంచి జీతం సంపాయిస్తున్నాడు. నేను-"

"ఇప్పుడు మీ రెక్కడ పనిచేస్తున్నారు? మీ జీతమేమిటి?"

"నాకొక జీతంబూ లేదు. దొరికిన ఉద్యోగమల్లా చేస్తూఉంటా. ఆవిధంగా నాకల్లా కొంత లోకోపకారం కూడా జరుగుతూంది," అన్నాను.

"అట్లా?" అన్నాడు మన తెలుగు వాడు.

"నాది కొంచెం గట్టితత్వమని చెప్పాను కాదూ? జబ్బుపడటం నాకు తగని అసహ్యం. అందుచేత ఉద్యోగాలకి అంతో ఇంతో ఎదురుతిరుగుతా. ఆ కారణంచేత, నేను ఖాళీచేసిన ఉద్యోగంలోకి వచ్చిన రోగులకి నాలుగురాళ్లెక్కువ దొరుకుతూంటాయి," అన్నాను.

"మీరు కిందటిసారి ఖాళీచేసిన ఉద్యోగం ఏమిటి, బాబూ? ఇంకా ఖాళీగానే ఉందా?" అన్నాడు మన తెలుగువాడు ఆత్రంగా.